క్లుప్తంగా

బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్నిక


సుందరయ్యయాదవ్ (ఫైల్)

నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎం.సుందరయ్యయాదవ్ ఎన్నికయ్యారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉమామహేశ్వర్‌తోపాటు మరో 12 మంది కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుందరయ్యయాదవ్‌ను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయనను అభినందించారు.

ఆక్రమణలు తొలగించాలి


ఫిర్యాదు చేస్తున్న ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు

నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానానికి చెందిన స్థలం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని అగ్నికుల క్షత్రియ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్, కార్యదర్శి కె.జ్ఞానేంద్ర, దేవస్థానం పునర్నిర్మాణ కమిటీ గౌరవాధ్యక్షుడు సి.రాములు తెలిపారు. దేవస్థానానికి చెందిన విలువైన 33.44 అంకణాల స్థలాన్ని కలికి మస్తానమ్మ ఆక్రమించుకున్నారంటూ జిల్లా దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారి జె.శ్రీనివాసరావుకు గురువారం ఆయన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో తాము రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా తక్షణమే ఆక్రమణలను తొలగించాలంటూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆక్రమణలు తొలగించలేదని, తక్షణమే దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారులు ఆక్రమణలను తొలగించి దేవస్థానానికి చెందిన విలువైన స్థలాన్ని కాపాడాలని కోరారు.

పెళ్లి పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించడమే కాకుండా తన స్నేహితుల ద్వారా వేధింపులకు గురిచేస్తున్న ఓ వ్యక్తిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..బీవీనగర్‌కు చెందిన ఓమహిళ కుటుంబకలహాల నేపథ్యంలో ఆరేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయి కుమార్తెతో కలిసి ఉంటోంది. టైలరింగ్, చీరల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో గూడూరులోని ఓ ప్రైవేటు బ్యాంకుకు లోను కోసం వెళ్లగా అక్కడ బ్యాంకు ఉద్యోగి మహేష్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో మహేష్ లోన్ కావాలంటే తన కోర్కె తీర్చాలని ఒత్తిడి చేయగా ఆమె నిరాకరించింది. దీంతో పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఆమెను లోబర్చుకున్నాడు. అనంతరం ఆమెకు బ్యాంకులో రూ.2 లక్షలు రుణం ఇప్పించి దానిని సైతం తన సొంతానికి వాడుకున్నాడు. అనంతరం ఇద్దరూ కలిసి కొంతకాలంగా సహజీవనం చేస్తున్నారు. మద్యం మత్తులో కొట్టడం, బ్లేడ్‌తో కోసి హింసించినా పెళ్లి చేసుకుంటాడని నమ్మిన ఆమె అతని చేష్టలను మౌనంగా భరిస్తూ వచ్చింది. ఇటీవల ఎప్పుడు పెళ్లి చేసుకుంటావని మహేష్‌ను ఆమె నిలదీయగా ఇంట్లో వారిని అడిగి వస్తానని చెప్పి గూడూరుకు వెళ్లాడు. అప్పట్నుంచి ఫోన్ స్విచ్ ఆపివేశాడు. తన స్నేహితులకు మహిళ ఫోన్ నంబర్ ఇవ్వగా వారు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడసాగారు. దీంతో తనను పెళ్లిచేసుకుంటానని మోసగించడమే కాకుండా లోను తాలుకా నగదు కాజేసి, తన స్నేహితుల ద్వారా ఇబ్బందులకు గురిచేస్తున్న మహేష్‌పై తగిన చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోవుల క్షుద్బాధ తీర్చండి


వినతిపత్రం అందజేస్తున్న మిడతల రమేష్, సునీల్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(బృందావనం): జిల్లాలో నర్రవాడలోని శ్రీవెంగమాంబ ఆలయం గోశాలలో ఆవులు క్షుద్బాధతో అలమటిస్తున్నాయని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ పేర్కొన్నారు. నర్రవాడ గోశాలలోని సుమారు 150 ఆవులు గ్రాసం లేక ఇబ్బందులు పడుతున్నాయంటూ ఆయన నెల్లూరులోని జిల్లా దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారి జె.శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అధికారులు హుండీ కానుకలు లెక్కవేసుకుంటూ గోశాలను మరిచిపోయారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి గోవులను కాపాడాలని కోరారు. ఆయన వెంట వి.సునీల్‌రెడ్డి, బి.రామకృష్ణ, పి.రామకృష్ణ, నారాయణరావు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ టిడ్కో గృహాలు

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్


మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

నెల్లూరు(బారకాసు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తూ టిడ్కో గృహాలను దసరా నాటికి అందజేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. సిటీ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన సమీక్ష సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నెల్లూరు నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనతోపాటు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. వెంకటేశ్వరపురం, అల్లీపురం వద్ద నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లలో అన్ని మౌలిక వసతులు కల్పించి దసరా నాటికి లబ్ధిదారులకు అందజేసేలా సిద్ధం చేయాలన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడంతోపాటు అవసరమైన బ్యాంకు రుణాల మంజూరుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.112 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి 120 పనులు చేపట్టినట్లు తెలిపారు. వీటిని సత్వరం పూర్తి చేసేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్, మేయర్ స్రవంతి, టిడ్కో ఎండీ శ్రీధర్, మున్సిపల్‌శాఖ ఈఎన్‌సీ ఆనందరావు, కమిషనర్ వికాస్‌మర్మత్, డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, ఎస్ఈ సంపత్‌కుమార్, ఎల్‌డీఎం శ్రీకాంత్, ప్రదీప్‌కుమార్, మెప్మా పీడీ రవీంద్ర, కార్పొరేటర్లు, ఇంజినీరింగ్, టిడ్కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ హరినారాయణన్




హాజరైన అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, విద్యాశాఖ, మైన్స్, పరిశ్రమల శాఖ అధికారులతో సమావేశమై సంక్షేమశాఖల వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు, పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమశాఖ అధికారులు తప్పనిసరిగా సంబంధిత సంక్షేమ హాస్టళ్లను నెలకొకసారి తనిఖీ చేసి వసతి గృహాల్లో విద్యార్థులు మంచి వాతావరణంలో ఉంటూ విద్యనభ్యసించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు ఏవైనా సమస్యలు ఉంటే సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశామని, ఆర్‌ఓ ప్లాంట్లు లేనిచోట ఏర్పాటు చేసేలా మైన్స్, పరిశ్రమలు, కమర్షియల్ టాక్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సంక్షేమశాఖ అధికారులు కమిటీగా ఏర్పడి వారం లోపు యాక్షన్ ప్లాన్ తయారు చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమేష్, ఐటీడీఏ పీఓ మందా రాణి, పరిశ్రమలశాఖ జీఎం సుధాకర్, మైన్స్‌శాఖ డీడీ శ్రీనివాస్, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, జిల్లా బీసీ గురుకుల పాఠశాల కన్వీనర్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారికి సముచితస్థానం


పార్టీలో చేరిన వారితో నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచితస్థానం కల్పిస్తామని నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. నెల్లూరు నగరంలోని 4వ డివిజన్‌కు చెందిన షేక్ అలీం, మస్తాన్, సాధిక్ వారి మిత్రబృందం దాదాపు 100 మంది నగరంలోని రాజన్న భవన్‌లో నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఆకర్షితులై 4వ డివిజన్‌కు చెందిన షేక్ అలీం, మస్తాన్, సాధిక్ వారి మిత్రబృందం వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో మైఖేల్, సాబిద్, యాసిన్, ఫరూక్, ఖాజారసూల్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్ లక్ష్మీప్రత్యూష, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హంజాహుస్సేనీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సహకార సంఘాల నిర్వహణపై శిక్షణ

- ప్రారంభించనున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న డీసీఓ సుధాభారతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పీఏసీఎస్) సభ్యులకు సహకార సంఘాల పాలన, నిర్వహణలపై శుక్రవారం నగరంలోని టౌన్‌హాల్‌లో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సహకార శాఖాధికారి సుధాభారతి తెలిపారు. నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న డీసీఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన సహకార నిర్వహణ సంస్థ, ఐసీఎం (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్)కు చెందిన ప్రతినిధులు సహకార సంఘాల పాలన, నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారని తెలిపారు.
ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్యులు తప్పక హాజరుకావాలని తెలిపారు. ఈ నెల 19వ తేదీన తోటపల్లిగూడూరు, పడుగుపాడు పీఏసీఎస్‌లను ఐసీఎం ప్రతినిధులు సందర్శిస్తారని తెలిపారు.

డీఆర్‌డీఏ పీడీ విచారణ


మాట్లాడుతున్న పీడీ సాంబశివారెడ్డి

సంగం: మండలంలోని మర్రిపాడు గ్రామంలో ఓ బ్యాంక్ కరస్పాండెంట్ పొదుపు నగదు స్వాహా చేసిన ఘటనపై డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి గురువారం సంగంలో విచారణ చేపట్టారు. స్థానిక బ్యాంక్‌లో మేనేజర్‌తో మాట్లాడారు. అనంతరం పొదుపు సభ్యులను కూడా విచారించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బ్యాంక్ కరస్పాండెంట్ షాజహాన్ తప్పు చేసింది వాస్తవమేనని, ఆ నగదును తిరిగి చెల్లిస్తానని తెలిపినట్లు చెప్పారు. ముందు పొదుపు నగదు రికవరీ చేసే పని చేపడుతున్నామని, అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారి వెంట పొదుపు ఏపీఎం విజయలక్ష్మి ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని బుజబుజనెల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ రాజాబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యుత్ భవన్ వద్ద నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు గురువారం నగరంలోని విద్యుత్ భవన్ వద్ద కమిటీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆలయ ధర్మకర్త



నెల్లూరు (బృందావనం): నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పి. అనిల్‌కుమార్‌ను మూలాపేట సీఏఎం హైస్కూల్ వద్ద ఉన్న శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త ఎస్.సి. బాలాజీ సింగ్ గురువారం నగరంలోని రాజన్న భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఎస్.సి. కృష్ణసింగ్ ఉన్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యాయత్నంకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మహిళ మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని తడికలబజారుకు చెందిన లెనిన్ – నాగమాధురి(23) దంపతులు. వారికి ఇద్దరు కుమారులు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఏడాది క్రితం దంపతులు విడిపోయారు. అప్పటి నుంచి నాగమాధురి తన ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటోంది. గత కొంతకాలంగా ఆమె మతిస్థిమితం సరిగా లేక బాధపడుతోంది. అప్పుడప్పుడూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి నాలుగు రోజుల తర్వాత తిరిగి వచ్చేది. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీన ఆమె విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి కుటుంబసభ్యులు గురువారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తి

ముత్తుకూరు: జగనన్న కాలనీల్లో త్వరలో ఇళ్ల ప్రారంభోత్సవం చేయాల్సి ఉందని హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం అన్నారు. ఇప్పటికే 980 పక్కాగృహాలు పూర్తయ్యాయని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ స్టీఫెన్ మాట్లాడుతూ 2022 – 23 సంవత్సరంలో మండలంలో చేపల వేట చేసే పడవలకు డీజిల్‌పై ప్రభుత్వం రూ.56 లక్షల మేర సబ్సిడీ ఇచ్చిందన్నారు. మొత్తం 296 బోట్లకు డీజిల్‌ను సబ్సిడీపై సరఫరా చేసినట్లు తెలిపారు. మండలంలో 2,500 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోందన్నారు. దీనికి ప్రభుత్వ అనుమతి ఉంటేనే విద్యుత్ బిల్లులపై సబ్సిడీ ఉంటుందన్నారు. రైతులు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ గండవరం సుగుణ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీఓ ప్రత్యూష, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, మండల ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..


మంత్రి ఆదిమూలపు సురేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ గురువారం నెల్లూరుకు విచ్చేశారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బస చేసిన మంత్రిని కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్, మేయర్ స్రవంతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి పలు అంశాలపై చర్చించారు.




మంత్రిని కలిసిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కమిషనర్ వికాస్‌మర్మత్

ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలి

- నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ ఆశీర్వదించాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని 39వ డివిజన్ రావిచెట్టుసెంటర్, పాత జడ్జి బంగ్లావీధి, వాకర్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. పథకాలు అందని వారికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల ఇంటి ముంగిటకే అందించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. 2024లో జరిగే ఎన్నికల్లో కూడా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలందరూ ఆశీర్వదించి మరలా ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు మానికల సునీల్, నూనె ప్రసాద్, మల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో అధిక కాన్పులు జరిగేలా చూడాలి

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధిక కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు, ఆరోగ్యశ్రీ సేవలు మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాలకు చెందిన గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులకు వస్తారని, వారిని తిరిగి ఇతర ఆస్పత్రులకు పంపకుండా నాణ్యమైన వైద్యం అందించి కాన్పులు చేసి ప్రభుత్వ ప్రోత్సాహకాలతో తల్లీబిడ్డలను సంతోషంగా ఇంటికి పంపాలని సూచించారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి నెలవారీ చెకప్ చేయించుకుని కాన్పు కోసం ప్రభుత్వ ఆస్పత్రి వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నందున సంబంధిత అధికారులందరూ ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి రోజూ ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్లు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నెల్లూరు జనరల్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్లు పెంచేలా నిర్దిష్ట కార్యాచరణతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు.. 25 వేల సెల్ఫీలు


సెల్ఫీబూత్‌లో సెల్ఫీ దిగుతున్న యువకుడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ నెల్లూరులోని ఎంజీబీ మాల్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ ఇండియా సెల్ఫీ బూత్‌కు విశేష స్పందన లభించిందని గురువారం భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మూడు రోజులపాటు ఏర్పాటు చేసిన ఈ సెల్ఫీబూత్‌లో దాదాపు 25 వేల మంది సెల్ఫీలు తీసుకున్నారన్నారు. యువతకు డిజిటల్ ఇండియా విషయంలో అవగాహన కల్పిడచంతోపాటు డిజిటల్ ఇండియా అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేసేలా స్ఫూర్తినింపే ఉద్దేశంతో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ సెల్ఫీబూత్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్, మేక్‌ఇన్ ఇండియా, ఆవాస్ యోజన, వ్యాక్సిన్ డ్రైవ్, జలశక్తి అభియాన్ లాంటి కార్యక్రమాలపై యువతకు అవగాహన కల్పించేందుకు భారత ప్రభుత్వం ఈ స్టాల్స్ ఏర్పాటు చేసిందన్నారు.

ఉత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు

నెల్లూరు(బృందావనం): సింహపురి గ్రామదేవత శ్రీఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రావణమాస ఉత్సవాల ఆహ్వాన పత్రికలను గురువారం ఆవిష్కరించినట్లు ఆ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఆర్.శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి బొగ్గల మల్లికార్జునరెడ్డి తెలిపారు. మినీబైపాస్ రోడ్డులోని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకరరెడ్డి కార్యాలయంలో ఆదాల ప్రభాకరరెడ్డి ఆదేశాల మేరకు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి కొండ్రెడ్డి రంగారెడ్డి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హరిబాబుయాదవ్, నూనె మల్లికార్జునయాదవ్, పవన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి, మేఘనాథ్‌సింగ్, మురళి, శివారెడ్డి, పాలకమండలి సభ్యులు పి.రాములమ్మ, కె.పెంచలమ్మ, నాయకులు కొవ్వాకొల్లు బాబ్జీ, ఎస్.సురేష్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సుస్వరాభిషేకం



ఆర్థికసాయం అందజేస్తున్న దారా సురేష్, కొమెన్ నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో జిల్లా సినీఆర్కెస్ట్రా మ్యూజీషియన్స్ అసోసియేషన్(కొమెన్) ఆధ్వర్యంలో సుస్వర ఆర్కెస్ట్రా, ఈవెంట్స్, లక్కీ ఆర్కెస్ట్రా ఈవెంట్స్ సంయుక్తంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి, నృత్యప్రదర్శనల 'సుస్వరాభిషేకం' గురువారం రాత్రి ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంగీతం మాస్టారు దారా సురేష్ మాట్లాడుతూ జిల్లాలోని సినీ ఆర్కెస్ట్రా కళాకారులు ఐక్యతగా సాగి ఉన్నతంగా ఎదగాలన్నారు. కొమెన్ అధ్యక్షుడు సుస్వర రాజశేఖర్ మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల మృతిచెందిన తబలా ఆర్టిస్టు చినబాబు కుటుంబానికి రూ.25 వేలు, నిరుపేద కళాకారుడు అనంత కృష్ణాంజనేయశర్మకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకులు ఆలపించిన సినీగీతాలు, కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో లక్కీ ఆర్కెస్ట్రా ఆర్గనైజర్ పెంచలరెడ్డి, వాసవి ఆర్కెస్ట్రా ఆర్గనైజర్ లక్ష్మీప్రశాంతి, అడ్వొకేట్ శ్రీధర్, రాయల్, భాస్కర్, గాయకుడు రామచంద్రరావు, బుల్లితెర నటుడు ఎస్.మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.